ప్రజాశక్తి
గురువారం 8 ఆగస్టు 2024 5 అనంతపురం





సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ మురళీకృష్ణ, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

## పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు

### సమావేశంలో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ మురళీకృష్ణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నాడు పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం (పిసిఆర్, పిఓఎ యాక్ట్)పై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సభ్యులు పరిశీలించి తమ దష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు విషయమై సంబంధిత స్టేషన్ సిబ్బందికి అవగాహన కల్పించే విధంగా శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ మురళి కష్ణ మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. డివిఎంసి సభ్యులకు దక్కాల్సిన గౌరవం అందే విధంగా చూస్తామని చెప్పారు. శింగనమల శాసన సభ్యురాలు బండారు శ్రావణశ్రీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి ప్రతి ఒక్క బాధితుడికీ న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. శింగనమల మండలం రాచపల్లి వద్ద గతంలో ఒక లెదర్ ఫ్యాక్టరీ 2010 సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటివరకు ప్రహరి గోడ, రోడ్డు సౌకర్యం లేకుండా నిరుపయోగంగా ఉందని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ పరిశ్రమను ప్రారంభించగలిగితే వెయ్యి మంది ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన వారు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి..రామకృష్ణ, గాయత్రి దేవి, ఆర్డీవోలు ఇన్‌ఛార్జి వసంత బాబు, రాణి సుష్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బు కొఠారి, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపికి 'పైలా' రాజీనామా


- కొత్త జిల్లా అధ్యక్షులెవరో ?
- బాధ్యతలు చేపట్టేందుకు ముఖ్య నేతల విముఖత
- నియోజకవర్గ సమన్వయకర్తగా ఉంటే చాలనే భావన

అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పార్టీ, అధ్యక్ష పదవి రెండింటికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోషియల్ మీడియాలో వీడియోను బుధవారం నాడు విడుదల చేశారు. తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అందరూ ఇంతకాలం సహకరించినందుకు ధన్యవాదలూ తెలిపారు. ఎటువంటి ఆరోపణలుగానీ, విమర్శలుగానీ లేకుండానే సాదాసీదాగా తన రాజీనామా ప్రకటనను ఆయన చేశారు. ఎన్నికల ఫలితాల వెలువడినప్పటి నుంచే వైసిపిలో సంస్థాగతమైన మార్పులుంటాయని ప్రచారం నడుస్తూ వచ్చింది. అనంతపురం జిల్లాకు కొత్త అధ్యక్షుడి కోసం పరిశీలన సాగుతున్నట్టు కూడా గత కొంతకాలం ప్రచారం నడుస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఉన్న అధ్యక్షుడు తనంతట తానుగా పదవికీ, పార్టీకీ రాజీనామా చేయడం గమనార్హం. ఇక కొత్త అధ్యక్షుడు ఎవర్ని ఎన్నిక చేస్తారన్న దానిపై ఆ పార్టీలో సర్వత్రా చర్చ నడుస్తోంది.



**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

2012లో వైసిపి ఆవిర్భావం అయినప్పటి నుంచి జిల్లా అధ్యక్షుల విషయంలో ఆ పార్టీలో తరచూ మార్పులు చోటు చేసుకుంటూనే వస్తున్నాయి. కొంత కాలం శంకర నారాయణ, మరికొంత కాలం నదీమ్ అహమ్మద్, ఆ తరువాత పైలా నరసింహయ్య ఇలా మార్పులు, చేర్పులు జరుగుతూ వస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపి 12 స్థానాల్లో విజయం సాధించింది. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాల్లో వైసిపి మద్దతుదారులు విజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ గణనీయమైన స్థానాల్లోనే విజయం సాధిస్తుందని వైసిపి నేతలు ధీమాతో ఉంటూ వచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో వైసిపి ఒక్క స్థానంలోనూ గెలవలేక చతికిలపడింది. 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ ఓటమిని చవిచూసింది. ఇంతటి ఘోరమైన ఓటమి తరువాత పార్టీని తిరిగి పట్టాలపైకి ఎక్కించేది ఎవరన్న దానిపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఇందుకు అనుగుణంగా మార్పులు చేపట్టాలని పార్టీ అధిష్టానం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ బాధ్యతలను సీనియర్ నాయకులకు అప్పగిస్తే ప్రతిపక్షానికి ధీటుగా నిలబడే అవకాశం ఉంటుందన్న భావన అధిష్టానం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరు ఈ బాధ్యతలు స్వీకరించి కష్టకాలంలో పార్టీని నడిపిస్తారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతానికి అధ్యక్ష బాధ్యతను ఎవరూ తీసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు కన్పించడం లేదు. నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉంటే చాలాన్న అభిప్రాయంతోనే చాలా మంది నేతలు ఉన్నారు. జిల్లా అంతటా భారాన్ని మోసేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబరచడం లేదన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఇప్పుడే పార్టీ ఘోర ఓటమిని చవిచూసిన నేపథ్యంలో రాబోయే ఐదేళ్ల నడిపించాలంటే ఆర్థికపరమైన భారాలతోపాటు, నాయకులను సమన్వయపరచడం కష్టసాధ్యమని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ అధిష్టానం ఎవరిని ఒప్పించి జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తుందో చూడాల్సి ఉంటుంది. అటు సత్యసాయి జిల్లాలోనూ మార్పులుంటాయని తెలుస్తోంది.



పైలా నరసింహ్మాయ్య

## ముఖ్యమంత్రి స్పందన హర్షణీయం : ఓబులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకానికి నిధులు కేటాయించి, సక్రమంగా దీనిని నడపాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించడం హర్షణీయం అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. శ్రీ సత్యసాయి నీటి సరఫరా ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 750 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందన్నారు. ఈ పథకంలో 572 మంది కార్మికులు గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. కరోనా సందర్భంగా కూడా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని కార్మికులు పని చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో కార్మికులు వేతనాల కోసం నాలుగు నెలలకు ఒకసారి సమ్మెలు, నిరసనలు తెలపాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. తాగునీటి సరఫరా పథకం కార్మికుల సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్‌ను గత నెలలో సిఐటియు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించామన్నారు. రాష్ట్ర కలెక్టర్ల సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తాగునీటి పథకంపై ప్రస్తావన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి స్పందించి నిధులు కేటాయించి కార్మికులకు వేతనాలు చెల్లించి స్కీం సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం అభినందనీయం అన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇప్పటి వరకు కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు అందజేసి, పిఎఫ్, ఇఎస్ఐ, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## దేశాన్ని దోచేస్తున్న కార్పొరేట్ కంపెనీలు

**ప్రజాశక్తి-తాడిపత్రి**



రాజారామిరెడ్డి

దేశ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఏపీ రైతు సంఘం నాయకులు రాజారాంరెడ్డి డిమాండ్ చేశారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని 9న క్విట్ ఇండియా డే సందర్భంగా తాడిపత్రిలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నాడు పట్టణంలోని రైతుసంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1942 ఆగస్టు 9న ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశం విడిచి వెళ్లి పోవాలంటే క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందన్నారు. ఆ స్ఫూర్తితో రైతుల హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలు, దేశ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ కార్పొరేట్స్ క్విట్ ఇండియా నినాదంతో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య పిలుపునిచ్చిందన్నారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో విత్తన వ్యాపారం అంతా మోన్ శాంటో, కార్గిల్ లాంటి బహుళ జాతి కంపెనీ చేతుల్లో ఉందన్నారు. రైతులను రక్షించే విత్తన చట్టం లేదన్నారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని, వసూలు చేసిన ప్రీమియంలో 80 శాతం లాభాలు పేరుతో కంపెనీలు దోచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలపై విధించే పన్నును 30 నుంచి 20 శాతం తగ్గించారని, రైతుల వ్యవసాయ పరికరాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న జరిగే నిరసన ప్రదర్శన కార్యక్రమాల్లో స్థానిక రైతులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## సిపిఐ సీనియర్ నాయకులు ఎంవి.రమణ కన్నుమూత

### సిపిఎం నివాళి



ఎంవి.రమణ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర నాయకులు ఎంవి.రమణ(82) అనారోగ్య సమస్యలతో బుధవారం నాడు కన్నుమూశారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఎంవి.రమణ విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి, తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి ప్రజల కోసం పని చేసిన ఆదర్శ నేత అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాల్లో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు.

## చేనేతను నిర్వీర్యం చేసేలా బిజెపి చర్యలు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత పదేళ్లుగా సాగిస్తున్న అనాలోచిత నిర్ణయాలతో చేనేత రంగం నిర్వీర్యం అవుతోందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాయదుర్గం పట్టణ అధ్యక్షులు జి.మధు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు పట్టణంలో చేనేత కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికుల జీవన స్థితిగతులు దుర్భరంగా మారాయన్నారు. బిజెపి ప్రభుత్వం చేనేత రంగాన్ని ధ్వంసం చేసేలా తన విధానాలను రూపొందించి కార్మికులను నష్టం చేకూరుస్తోందన్నారు. 11 రకాల వస్త్రాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు రంగస్వామి, హనుమంతు, ప్రకాష్, అశోక్, లోకేష్, వీరేష్, గణేష్, సంజీవ, కుమార్, కృష్ణ, ప్రశాంత్, దర్శన్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడుతుందని ఈవోపీఆర్‌డి వెంకట నాయుడు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సంతే కొండాపురం గ్రామంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సంతేకొండాపురం , సూగేపల్లి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలతో మాట్లాడారు. మరుగుదొడ్లను నిర్మించుకోవాలని వారికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి మరుగుదొడ్డిని ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భర్త మల్లికార్జున, మాజీ ఎంపిటిసి కరేగౌడ, స్కూల్ కమిటీ ఛైర్మన్ కరేగౌడ పాల్గొన్నారు.

## గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తారా..? : ఏపీటీఎఫ్

**అనంతపురం కలెక్టరేట్ :** గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల విద్యారంగంలో అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని, వాటిని పరిష్కరించి విద్యారంగాన్ని గాడిలో పెట్టాల్సిన ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పాత తప్పిదాలను కొనసాగించాలని చూస్తున్నట్లు ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.నరసింహులు ఆరోపించారు. గురువారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను తీవ్రంగా నష్టం చేసిన 117 జీవో రద్దు చేయాలన్నారు. గతంలో చేపట్టిన సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు జిల్లా, మండల స్థాయి అధికారులు పరిష్కరించే వారిని చెప్పారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. ఇలాంటి చర్యలను మాని విద్యారంగం పటిష్టతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయులకు వెంటనే ఉద్యోగోన్నతులు కల్పించాలని తెలిపారు. పదిమంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను మూసివేసే నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ విజయవంతం

### నూతన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిద్దు, ఓతూరు పరమేష్

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఈ నెల 6, 7 తేదీల్లో ఉరవకొండ పట్టణంలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 32వ జిల్లా ప్లీనరీ సమావేశాలు విజయవంతం అయ్యాయి. 6వ తేదీ ఉదయం 11గంటలకు ప్లీనరీ ప్రారంభ సూచికగా వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ హాజరై ప్రస్తుత విద్యా వ్యవస్థ, గత ప్రభుత్వంలో విద్యారంగంలో చేసిన విద్యార్థి వ్యతిరేక మార్పులపై ప్రసంగించారు. అనంతరం వివిధ మండలాలు, నియోజకవర్గాల నుంచి హాజరైన సుమారు 300 మంది ప్రతినిధులతో సభ నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు, మండల కేంద్రాల్లో సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం, నియోజకవర్గ కేంద్రాలలో ఐటిఐ, డిగ్రీ కళాశాల, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, తదితర డిమాండ్లపై తీర్మానాలు చేసి భవిష్యత్తు ఉద్యమానికి దిశా నిర్దేశం చేసుకున్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీలో మార్పులు చేర్పులు చేశారు. నూతన జిల్లా అధ్యక్షులుగా సిద్దు, ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, జిల్లా బాలికల విభాగం కన్వీనర్‌గా రజిత, ఉపాధ్యక్షులుగా తరిమెల గిరి, వంశీ, వెంకీ, సహాయ కార్యదర్శులుగా రాచేపల్లి సూర్యప్రకాష్, భీమ, శివ, 20 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలపై కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమిస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్లీనరీలో అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



ఓతూరు పరమేష్
ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి



సిద్ధూ
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

## ఐకమత్యంతో గ్రామాల అభివృద్ధి : కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**ప్రజశక్తి -కణేకల్లు**

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఐక్యమత్యంతో గ్రామాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం నాడు ఎంపిడిఒ కార్యాలయంలో వైస్ ఎంపిపి లీలావతి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల అధికారులు సమావేశంలో శాఖలవారీగా గ్రామాల్లో జరిగిన అభివద్ధి పనులు, సమస్యలను తెలియపరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఎంత అప్పు ఉందన్న విషయంపై ఇప్పటికీ ప్రభుత్వం ఒక అంచనాకు రాలేని పరిస్థితి ఉందన్నారు. అభివద్ధి పనులను ఇప్పటికిప్పుడే చేయలేని పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రతి పంచాయతీలోనూ అభివృద్ధి పనులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా వర్షాలు తక్కువ ఉండడంతో పంటల సాగు కేవలం 35 శాతమే అయిందన్నారు. రైతులు ప్రత్యామ్నాయంగా కందులు, ఆముదం పంటలు సాగు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల గురించి ప్రతి గ్రామంలో వైద్యులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం తాను ప్రజాప్రతినిధులు, అధికారులకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావతి, సర్పంచి నిర్మల, మండల కన్వీనర్ లాలెప్ప, కో ఆప్షన్ సభ్యుడు శర్మస్, తహశీల్దార్ ఫణికుమార్, మండల అధికారి గూడెన్న తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ప్రచారానికి రూ.700 కోట్లు

- కల్తీ మద్యంతో జనం ఆరోగ్యానికి చిల్లు
- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

గత వైసిపి పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తన వ్యక్తిగత ప్రచారం కోసం రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలకు కోట్ల రూపాయల ప్రభుత్వ, ప్రజా సొమ్ము దుర్వినియోగం అవ్వడమే కాకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన అన్నారు. ఇలాంటి వాటిలో అన్ని మార్పులు తీసుకొస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. తన బొమ్మల పిచ్చితో నాటి సిఎం రూ.700 కోట్లు వాడేశారని విమర్శించారు. భూముల సర్వే రాళ్లపై జగన్ మోహన్ రెడ్డి బొమ్మ పేరు తొలగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇకపై రాజముద్ర ఉన్న కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు. రీ సర్వే వల్ల తలెత్తిన వివాదాలకు త్వరలోనే ప్రభుత్వం చెక్ పెడుతుందని అన్నారు. రాష్ట్రంలో అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుందన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ధన దాహంతో కల్తీ మద్యాన్ని తీసుకొచ్చి, ఎంతో మంది ప్రాణాలు తీశారన్నారు. మద్యంపై ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొత్త మద్యం పాలసీని చంద్రబాబు నాయుడు తీసుకొస్తున్నారని చెప్పారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కొత్త పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై దగ్గుపాటి హర్షం వ్యక్తం చేశారు.

## 9 కిలోల గంజాయి పట్టివేత - ఐదుగురు అరెస్ట్

**ప్రజాశక్తి-పామిడి**

గంజాయి వ్యాపారం చేస్తున్న ఐదుగురిరి అరెస్టు చేసి, వారి నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పామిడి మండలం పాల్యం గ్రామానికి చెందిన అన్నదమ్ములు తమ్మినేని శివకుమార్, తమ్మినేని నందకుమార్, గోపాలకష్ణ, పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన అమర్నాథ్, అనంతపురం నందమూరి నగర్‌కు చెందిన పత్తిపాటి రవితేజ జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయాలను మొదలు పెట్టారు. గత 3 నెలల నుంచి వివిధ ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుక్కొని దానిని అనంతపురం, గుంతకల్లు పట్టణాల్లో కొత్త వ్యక్తులకు అమ్మకాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల గంజాయి వ్యాపారంలో భాగంగా విశాఖపట్నంలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. గంజాయిని తీసుకుని విశాఖపట్నం నుంచి తమ సొంత గ్రామమైన పామిడి మండలం పాల్యంకు తమ్మినేని శివకుమార్ కు చెందిన కారులో తరలించారు. అక్కడి నుండి బుధవారం ఉదయం పామిడి మండలం నీలూరు క్రాస్ దగ్గరలో నేషనల్ హైవే 44 రోడ్డు పక్కన కారులో గంజాయిని పెట్టుకుని కొనే వారికోసం ఎదురు చూస్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో సీఐ రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి లీలా వసుంధరతో కలిసి వారిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి తొమ్మిది కిలోల గంజాయి, ఐదు సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, రూ.5వేల నగదను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షలు ఉంటుందని సిఐ తెలిపారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తుల ధర్నా

**గుత్తి :** మండలంలోని బేతాపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చిన్న ఆంజనేయులు, గ్రామస్తులు వంకాయల శీనా, గోపాల్ మాట్లాడుతూ గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న వంకాయ వీధిలో తరచూ విద్యుత్ సమస్య ఏర్పడుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని చెప్పారు. విద్యుత్ సమస్య వల్ల తాగునీటి పథకానికి సంబంధించిన మోటారు ఫీజులు కాలిపోతున్నాయని అన్నారు. నాలుగు విద్యుత్ స్తంభాలు, అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని పదేళ్లుగా విద్యుత్ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



# చేనేతల సంక్షేమానికి సిఎం చంద్రబాబు కృషి

**ప్రజాశక్తి-అనంతపురం**

చేనేతల జీవితాల్లో వెలుగులు నింపేది టిడిపి అధినేత, సిఎం చంద్రబాబునాయుడే అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద ఉన్న చేనేత, జౌళిశాఖ కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యంలో చేనేత నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పద్మ శాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా సూర్యనారాయణ, టిఎన్‌టియుసి అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ సిఎం చంద్ర బాబు చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ విధానంపై సంస్కరణలు తీసుకురావాలని పేర్కొనడం, చేనేత జౌళి శాఖ మంత్రి పదవి బిసి ఎమ్మెల్యే సవితకు ఇవ్వడం, చేనేత రంగంపై ఆధారపడిన కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పింఛను అందజేయం హర్షణీయమన్నారు. మంత్రి నారా లోకేష్ కూడా చేనేత రంగానికి సంబంధించి టాటా సంస్థతో ఒప్పందం చేసుకోవడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కూడా చేనేత కులాలకు ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, నామినేటెడ్ పదవుల్లో చేనేత కులాలకు ప్రాధాన్యం కల్పించాలని, రాజకీయంగా ఎదగడానికి దోహదపడాలని కోరారు. అనంతపురం నగరంలో నేతన్న ప్రతిమ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నేతన్నలను శాలువాల, పూలమాలలతో సన్మానించా రు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు పొడరాల రవీంద్ర, వగ్గా రాజశేఖర్, జానపాటి సత్యనారాయణ, జక్కా వెంకట్రామయ్య, దేవిరెడ్డి వెంకటేష్, కడియాల కొండన్న, పాల వెంకటేశు, కురుగుంట వెంకట్రాముడు, జింకా శ్రీనివాసులు, రాముడు, రమేష్, అల్లీపీరా, రాజేష్, శివకుమార్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ చేనేత దినోత్సవంలో టిడిపి నాయకులు



అనంతపురంలో జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న టిడిపి నాయకులు

**పెద్దపప్పూరులో చేనేత జెండా ఆవిష్కరణ**

**పెద్దపప్పూరు :** ఎపి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపప్పూరు పి.ఆదినారాయణ, ఆర్‌డిటి సిఐ ఓబులేసు, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా పురుషోత్తం హాజరై మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్దదైన చేనేత పరిశ్రమ ప్రత్యక్షంగా ఒకటిన్నర కోటి మందికి, పరోక్షంగా 10 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు తల రామకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గం తహశీల్దార్‌గా భాస్కర్ బాధ్యతల స్వీకరణ



**కళ్యాణదుర్గం :** నూతన తహశీల్దార్‌గా ఎస్‌బి.భాస్కర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సుధాకర్ రావు బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న భాస్కర్ ఇక్కడికి వచ్చారు. నూతన తహశీల్దార్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యాలయ సిబ్బందితో పాటు వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు.

## సబ్ రిజిస్ట్రార్‌గా నారాయణస్వామి



**కళ్యాణదుర్గం :** నూతన సబ్ రిజిస్ట్రార్‌గా నారాయణస్వామి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న నాయుడు బదిలీపై అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పని చేస్తున్న నారాయణస్వామి ఇక్కడికి వచ్చారు.

## దూడలకు వ్యాక్సిన్

**బెళుగుప్ప :** జాతీయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో 4 నుంచి 8 నెలల లోపు ఉన్న పెయ్య దూడలకు వ్యాక్సిన్ వేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఒకసారి టీకా వేస్తే దూడల్లో జీవితకాలం వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. గుండ్లపల్లి గ్రామంలో 30 దూడలకు, ఆవులెన్న గ్రామంలో 10 దూడలకు, బూతువర్తి గ్రామంలో 11 దూడలకు బెళుగుప్ప తండాలో 8 దూడలకు మొత్తం 59 దూడలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. దూడలకు వ్యాధులు సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పెద్దవడుగూరు :** మండలంలోని మిడుతూరు గ్రామంలో గత నెల 16వ తేదీ జాతీయ రహదారి-44 పక్కన ఉన్న గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డారు. అతడిని చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. అతడి బంధువుల ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా లభించలేదన్నారు. అతడి వయస్సు 30-40ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు, తెలుపు చారలు కల్గిన చొక్కా ధరించాడని, మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్ల గుంతలోకి పడిపోయాడన్నారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

## పేకాట జూదరులు అరెస్ట్

**అనంతపురం క్రైం :** ఆత్మకూరు, కూడేరు పరిధిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇన్‌ఛార్జి సిఐ వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఇద్దరు జూదరులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న మరో ఏడుగురు పారిపోయారు. వీరి పేర్లు నమోదు చేసుకున్నామని, త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు. కాగా కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆత్మకూరు మండలం శిద్ధరాంపురం, యాలేరు, కూడేరు మండలం కరుట్లపల్లి, తిమ్మాపురం, పరిసరాల్లోని తోటలు, గుట్టల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం పోలీసులకు తెలిసినప్పటికీ అధికారికి తెలియకుండా కిందిస్థాయి సిబ్బంది మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వెళుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పారిపోయిన ఏడుగురు కూడా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి వద్దకు వెళ్లి కేసు నుంచి తప్పించాలంటూ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, త్వరలో పారిపోయిన ఏడుగురిని అరెస్టు చేస్తామని సిఐ వెంకటేష్ నాయక్ తెలిపారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్

**ప్రజాశక్తి-వజ్రకరూరు**



ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న జనసేన పార్టీ నాయకులు

విడపనకల్ మండల ప్రజలకు వైద్య ఆరోగ్యానికి సంబంధించి రవాణా సౌకర్యం కల్పించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత అంబు లెన్స్‌ను ప్రారంభించినట్లు ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ పేర్కొన్నారు. ఉరవకొండ మండలంలోని పెన్నహో బిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం పూజలు చేసి ఉచిత అంబులెన్స్ సర్వీస్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల నాయకులు గొల్ల ధనుంజయ సహకారంతో ఉచిత అంబులెన్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఉచిత అంబులెన్స్ సర్వీసును మండల వ్యాప్తంగా ప్రజలు వినియోగించు కోవచ్చని సూచించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపాశారు. ధనుంజయ మాట్లాడుతూ జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో అంబులెన్స్ సర్వీస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విడపనకల్, ఉరవకొండ, వజ్రకరూరు, బెళుగుప్ప మండలాల అధ్యక్షులు గోపాల్, చంద్రశేఖర్, కేశవ, సుధీర్, నాయకులు లోకేష్, టి.బొజ్జన్న, రాజేష్, రమేష్, బోగేష్, శేఖర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

మండల వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి సీజనల్ వ్యాధులను అరికడదామని ఉరవకొండ ఎంపీడీవో జివి.సుబ్బరాజు పిలుపునిచ్చారు. ఉరవకొండ మండలంలోని షేక్షానుపల్లి, రాచర్ల, లత్తవరం, లత్తవరం తండా గ్రామాల్లో బుధవారం వైద్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్ కింద పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపిడిఒ సుబ్బరాజు, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండ రామిరెడ్డి తెలిపారు. రాచర్ల తండాలోని 40 మంది గిరిజనుల ఇళ్లలో స్ప్రేయింగ్ చేయించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్‌గునియా, మెదడువాపు, బోధకాలు, తదితర వ్యాధులు రాకుండా సాధ్యపడుతుందని అనంతపురం జిల్లా అదనపు మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ తెలిపారు.కార్యక్రమంలో ఉరవకొండ మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి.జయరాములు, ఐసిడిఎస్ సూపర్వైజర్ తిరుపాల్ బాయి, ఎంపిహెచ్ఇఒ గోవిందు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి చందన, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, ఎఎన్ఎం వరలక్ష్మి, అంగన్వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**




సామాజిక తనిఖీ వేదిక నిర్వహిస్తున్న అధికారులు

స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీడీవో రాఘవ అధ్యక్షతన 'ఉపాధి' సామాజిక తనిఖీ వేదిక ప్రజాప్రతినిధులు, ప్రజలు లేకుండా తూతూ మంత్రంగా నిర్వహించారు. 20 23 నుంచి 2024 మార్చి వరకూ ఉపాధి హామీ ద్వారా రూ. 81 కోట్లతో పనులు నిర్వహించినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల వారీగా వివరించారు. చాలా గ్రామాల్లో కూలీల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని, ఎస్టిమేషన్ ఒకచోట పనులు మరోచేట చేశారని, కాలువలు మరమ్మతులు సక్రమంగా చేయలేదని, తదితర అవినీతి, అక్రమాలను గుర్తించారు. మొత్తంగా 40 శాతం నిధులు పక్కదారి పట్టాయని తేల్చి, వాటిని రికవరీ చేయాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సదాశివరెడ్డి, అజంతుల్లా, ఎపిఎం రమేష్, టిఎ బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : ఈఒఆర్‌డి

**ప్రజాశక్తి-నార్పల**



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఈఒఆర్‌డి శైలజరాణి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలని ఈవోఆర్‌డి శైలజరాణి సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన వల్ల పరిసరాలు అపరిశుభ్రమవుతాయని, వాటిపై దోమలు, ఈగలు చేరి వాటి ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, టైఫాయిడ్, మలేరియా, తదితర రోగాలు ప్రబలుతాయని తెలిపారు. ఈవోఆర్‌డి నార్పలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజలకు మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అలాగే ఈవోఆర్‌డి సచివాలయ సిబ్బందితో కలిసి ఒడిఎస్ పల్స్ సర్వేలో పాల్గొంటున్నారు. గ్రామాల్లో మరుగు దొడ్డి లేని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## ఈ క్రాప్ నమోదు పై అవగాహన

**ప్రజాశక్తి-గార్లదిన్నె**

ఖరీఫ్-2024లో ఇప్పటివరకు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయడంపై బుధవారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో తహశీల్దార్ ఈరమ్మ, ఎఒ సోమశేఖర్ రైతు సేవా కేంద్రం సిబ్బంది, విఆర్‌ఒ, సర్వేయర్లకు అవగాహన కల్పించారు. ఎఒ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకూ వేరుశనగ 1746 ఎకరాలు, కంది-1300, ఆముదం-1690, పత్తి 133 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. ఆయా పంటలను వంద శాతం నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బంది, విఆర్‌ఒలను సంప్రదించి పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, ఆధార్ కార్డు తీసుకెళ్లి ఈ పంట నమోదు చేయించుకొని, ఈకేవైసి(వేలిముద్ర) వేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్యామలాదేవి, ఎస్‌ఒ రాజ్యలక్ష్మి, ఎఇఒ స్రవంతి, విఆర్‌ఒ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**క్రాప్ బుకింగ్‌లో అవకతవకలకు పాల్పడితే చర్యలు**

**పుట్లూరు :** మండల వ్యాపంగా ఖరీఫ్ పంటలకు సంబంధించి క్రాప్ బుకింగ్ సక్రమంగా నిర్వహించాలని తహశీల్దార్ శేషారెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. స్థానిక తహవీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ క్రాప్ బుకింగ్ సక్రమంగా నిర్వహించాలని, ఏవైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఓ కాత్యాయని, వీఆర్వోలు, విహెచ్ఎలు, విఎఎలు, తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

**గుత్తి :** విశ్వకవి, నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు గోవిందప్ప, శామ్యూల్, నారాయణరెడ్డి, వెంకటనారాయణ, నారాయణశెట్టి, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెన్షనర్స్




ట్రాన్స్‌జెండర్ల కోసం హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించిన సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

## పెద్దాసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక హెల్ప్ డెస్క్

**అనంతపురం :** నగరంలోని సర్వజన ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల చికిత్స కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. విహెచ్ఎస్ సీడీసీ ప్రాజెక్ట్ అస్పైర్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని ఒపీ నెంబర్-1లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను బుధవారం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయించిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ, భాస్కర్, విహెచ్ఎస్ నుంచి డబ్ల్యు.వెంకటేశ్వరమ్మ, రీజినల్ కో ఆర్డినేటర్, సిబ్బంది, ట్రాన్స్‌జెండర్స్ నాయకులు ఆసిఫ్, అంజలి, మీరా, రాధ, కీర్తి పాల్గొన్నారు.

## మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం :** 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు 8వ తరగతి విద్యార్థులు సెప్టెంబర్ 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.5 లక్షల లోపు ఉండాలన్నారు. పరీక్ష డిసెంబర్ 8వ తేదీ ఉంటుందన్నారు. పరీక్ష ఫీజు ఓసీ, బిసిలు రూ. 100, ఎస్సీ, ఎస్టీలు రూ. 50ను సెప్టెంబర్ 10వ తేదీ లోపు చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం www.bse.ap.gov.inలో సంప్రదించాలన్నారు. లేదా నగరంలోని కమలానగర్‌లో ఉన్న డిఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన

**పామిడి :** స్థానిక చైతన్య కాలనీలో ఉన్న అభయాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రిటైర్డ్ హెచ్ఎం రామాంజనేయులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ట, అశ్వర్థనారాయణస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరలిఖిత హాజరయ్యారు. ఉదయం నాగ ప్రతిష్ట, ఆ తర్వాత అశ్వర్థ నారాయణస్వామి కల్యాణం, మధ్యాహ్నం పూర్ణాహుతి, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

## దంచర్లలో పొలంబడి

**గుంతకల్లు రూరల్ :** మండలంలోని దంచర్ల గ్రామంలో బుధవారం రైతు నాగరాజు పొలంలో గ్యాప్ పొలంబడి కార్యక్రమం చేపట్టారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో భాగంగా ఎడిఎ పద్మజ, ఎఒ కె.స్వాతి ఆధ్వర్యంలో వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యల్లో భాగంగా వేపనూనెను స్ప్రే చేయించారు. వారు మాట్లాడుతూ గ్యాప్ పొలంబడిలో కంచె, ఆకర్షక పంటలు వేసుకోవడం వల్ల ప్రధాన పంటల మీద పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. అంతర పంటలు వేసుకోవడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోతారని తెలిపారు. అలాగే జీవామృతం, కాషాయలు తయారు చేసుకొని, వాడుకొనే విధానం, విత్తన శుద్ధి చేసుకునే విధానం గురించి తెలిపారు. అలాగే వేరుశనగ పంటలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

## ఉద్యోగాల నుంచి తొలగించవద్దు

**బొమ్మనహాల్ :** ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకెపి కార్యాలయంలో విఒలు, ఆశా వర్కర్లుగా పని చేస్తున్న దళితులను విధుల నుంచి తొలగించవద్దని కోరుతూ బుధవారం మండలంలోని దండోరా నాయకులు ఎంపీడీవో రాఘవను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా ఉద్యోగాల్లో పని చేస్తున్న దళితులను అకారణంగా తొలగిస్తున్నారని, దీంతో కొందరు ఉద్యోగులు మనస్థాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కార్యాలయంలో దళితులను తొలగిస్తారో ఆ కార్యాలయం వద్ద ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగానహల్లి, కొలగానహల్లి, బొమ్మనహాల్, గోవిందవాడ, లింగదహాల్ గ్రామానికి చెందిన దండోరా నాయకులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌ను కలిసిన నాయకులు

**అనంతపురం :** నూతనంగా బాధ్య తలు చేపట్టిన అనంతపురం అర్బన్ తహశీల్దార్ హరి కుమార్‌ను బుధవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారు మాట్లాడుతూ అధికారుల దృష్టికి వచ్చిన నగర ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని అనంతపురం పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి వెంకటరామయ్య కోరారు. ప్రధానంగా విద్యార్థులకు అవసరమయ్యే సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలని కోరారు. కలిసిన వారిలో టిఎన్ఎస్ఎఫ్, జనసేన నాయకులు ఉన్నారు.

# నేడు ఎస్ఎంసి ఎన్నికలు : ఎంఇఒలు

**ప్రజాశక్తి-నార్పల**

మండల వ్యాప్తంగా గురువారం పాఠశాలల్లో నిర్వహించే ఎస్ఎంసి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో 34 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు, కెజిబివి, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహిస్తా మన్నారు. ఎన్నికల విధి విధానాలపై అన్ని పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. కాగా మండలంలో కొన్ని పాఠశాలల్లో ఎస్ఎంసి ఛైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. దీంతో ఆయా పాఠశాలల ఎన్నికల్లో గట్టిపోటీ తప్పేలా లేదు. ఇప్పటికే ఆశావహులు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మద్దతు కోరుతున్నారు. పోటీ తీవ్రంగా ఉండి సమస్యాత్మకంగా ఉన్న పాఠశాలలను గుర్తించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు.

**ఛైర్మన్ పదవికి పెరిగిన పోటీ**

గత ప్రభుత్వ హయాంలో పాఠశాల అభివద్ధి పేరుతో నాడు-నేడు పనులు చేపట్టారు. అందులో చాలా వరకు పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, వాటితో పనులు పూర్తి చేయవచ్చని పలువురు ఆశిస్తున్నారు. దీంతో ఛైర్మన్ పదవికి పోటీ ఏర్పడింది. ఉన్నత పాఠశాలల్లో పోటీ మరీ తీవ్రంగా ఉంటుంది. ఛైర్మన్ పదవికి కొన్నిచోట్ల పదుల సంఖ్యలో బరిలో దిగుతున్నట్లు సమాచారం.

**ఎన్నికల ప్రక్రియ ఇలా..**

నిబంధనల ప్రకారం ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులను ఎన్నుకుంటారు. ఇందులో ఎస్సీ, బీసీ, ఓసీ, రిజర్వేషన్‌తో పాటు కచ్చితంగా ఇద్దరు మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ ప్రక్రియకు ముందే విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలో సమావేశ పరిచి అభిప్రాయాలు సేకరిస్తారు. ఆ తరువాత విద్యార్థుల తల్లిదండ్రుల ఓటరు జాబితాను పాఠశాల బోర్డుపై ఉంచుతారు. అభ్యంతరాలున్న వాటిని తొలగిస్తారు. ఈ నెల 8వ తేదీ ఉదయం ప్రతి తరగతి నుంచి ఎన్నుకున్న సభ్యులతో మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరుగుతుంది. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. వీరి పదవీ కాలం రెండేళ్లు. ఎన్నుకోబడిన వారు పాఠశాల అభివృద్ధి, నిర్వహణ, విద్యాప్రమాణాలు పెంచి నగదుకు సంబంధించిన లావాదేవీలు ఎస్ఎంసి ఛైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకాలతో జరుగుతాయి. ప్రతి పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కమిటీ సభ్యులతో పాటు ఆ పాఠశాల హెచ్ఎం, సీనియర్ ఉపాధ్యాయుడు, స్థానిక అంగన్వాడీ కార్యకర్త, ఎఎన్ఎం, వార్డు మెంబర్ ఎక్స్అఫిషియో సభ్యులుగా ఉంటారు.

## ప్రతి సచివాలయంలో ఇమ్యునైజేషన్ కేంద్రం నిర్వహించాలి

### నగర మేయర్ మహమ్మద్ వసీం

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**



ఇమ్యునైజేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం

నగరంలోని ప్రతి సచివాలయంలో ఇమ్యునైజేషన్ కేంద్రాలు నిర్వహించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. నగరంలోని 38వ డివిజన్ పరిధిలో చిన్నారులు, గర్భిణులకు ప్రతి బుధవారం నిర్వహించే ఇమ్యునైజేషన్ కేంద్రాన్ని బుధవారం మేయర్ సందర్శించారు. మేయర్ మాట్లాడుతూ కొన్ని సచివాలయాల పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తుం డటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ప్రతి సచివాలయంలో ఇమ్యునైజేషన్ కేంద్రాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. ప్రతి సచివాలయంలో ఇమ్యునైజేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల చిన్నారులు, గర్భిణు లకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ ఇషాక్, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, నాయకులు కిషోర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## మూఢనమ్మకాలు ప్రగతికి అవరోధాలు

**ప్రజాశక్తి-రాయదుర్గం**



విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న వక్తలు

మూఢనమ్మకాల వల్ల దేశ ప్రగతి, మానవాళి భవిష్యత్తు అంధకారం అవుతుందని 'మానవత' సంస్థ వ్యవస్థాపకులు తరిమెల అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. 'మూఢ నమ్మకాల వల్ల కలిగే ఇబ్బందులు, నష్టాలు'పై పట్టణంలోని పివిఆర్ పాఠశాల, జడ్పీ బాలికల హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మానవత సంస్థ కోకన్వీనర్ సలాం మాలిక్ మాట్లాడుతూ మాయలు మంత్రాలు ఉండవని, సైన్స్ మాత్రమే శాశ్వతమని ఉదాహరణలతో వివరించారు. మ్యాజిక్ చేసి చూపించారు. విద్యార్థులతో కూడా మ్యాజిక్ అంశాలు చేయిస్తూ వాటి వెనుక ఉండే సైన్స్ నిగూఢాన్ని వివరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచే లక్ష్మీనారాయణ జంక్, ఫాస్ట్ ఫుడ్ వల్ల జరిగే ఆరోగ్య అనర్థాలను వివరించారు. జంక్ ఫుడ్స్ తినడం మానేస్తామని విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌భాస్కర్, బాలికల హైస్కూల్ హెచ్ఎం జయప్రద, పివిఆర్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్‌కుమార్ రెడ్డి, జెవివి సీనియర్ నాయకులు గౌర సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ఎంజి.వీరన్న, ఆవుల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు రక్ష

**ప్రజాశక్తి-వజ్రకరూరు**



పెద్దపప్పూరులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు

తల్లిపాలే బిడ్డలకు రక్ష అని ఉరవకొండ ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. ఉరవకొండ మండలంలోని రాచర్లతండా, విడపనకల్ మండలంలోని హావలిగి గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సుబ్బరాజు అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జన్మించిన గంటకే బిడ్డకు ముర్రు పాలు తాగించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి జయరాములు, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ తిరుపాల్‌బాయి, ఎంఎల్‌హెచ్‌పి పి.సుశీల, ఎఎన్ఎం సీతమ్మ, అంగన్వాడీ టీచర్లు సరళ, త్రివేణి, హేమలత, శశికళ, రమాదేవి, నాగవేణి, సునీత, ఉష, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపప్పూరు :** తల్లి ముర్రుపాలే బిడ్డకు సంజీవినిలా పని చేస్తాయని సిడిపిఒ సాజిదా బేగం తెలిపారు. మండలంలోని సోమనపల్లి, నారాపురం, చాగల్లు గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ ముర్రుపాలు విశిష్టతను బాలింతలకు వివరించారు. బిడ్డ పుట్టిన గంట లోపే తల్లి ముర్రు పాలు పట్టిస్తే పిల్లలకు సమస్యలు రాకుండా మంచి యాంటీబయాటిక్స్ పెంచుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు గీత, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు

**యల్లనూరు :** మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ రాజమణి, వైద్యాధికారిణి కీర్తన తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు పలు సూచనలు చేశారు. పుట్టిన గంట లోపే శిశువుకు ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, గర్భిణులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది జైనాబి, గోవర్ధన తల్లిపాల విశిష్టతను తెలిపారు. బుడ్డీ పాలు వద్దు.. తల్లిపాలే ముద్దు అన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, పిల్లల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



యల్లనూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

## 'ఉద్యాన' రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

ప్రభుత్వం అమలు చేసే రాయితీలు, ఉద్యాన పథకాలు, క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం పొందాలంటే ప్రతి రైతూ సెప్టెంబర్ 15వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారి ఎం.కృష్ణ తేజ సూచించారు. ఆయన బుధవారం బెళుగుప్ప వ్యవసాయ అధికారులు, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ అమలు చేసే పథకాలను 40-50 శాతం రాయితీతో అందిస్తారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు గ్రామస్థాయిలో ఉన్న సిబ్బందిని సంప్రదించి ఆధార్, పట్టాదారు, వన్‌బి, అడంగల్, బ్యాంక్ పాస్ బుక్కు అప్లికేషన్ ఫారం ఇచ్చి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఎడిఎ ఎల్లప్ప, బెళుగుప్ప ఎఒ పృథ్వీసాగర్, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కెజిబివిలో డ్రెయినేజీ పనులకు శ్రీకారం

**బెళుగుప్ప :** మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కెజిబివి)లో డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ పనులను రూ. 2 లక్షలతో చేపట్టి నట్లు అధికారులు తెలిపారు. పనులను డిఇ షఫ్రీన్, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున పరిశీలించారు.